సాక్షి వనపర్తి

గురువారం । 14 । ఆగస్టు । 2025



జలాశయాలకు జలకళ

విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని పలు జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి.

-8లో ▸



విగ్రహాల తొలగింపు

జడ్చర్ల సిగ్నల్‌గడ్డ రైల్వేవంతెనకు ఇరువైపులా ఉన్న మహనీయుల విగ్రహాల తొలగింపు బుధవారం ఉద్రిక్తతకు దారి తీసింది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
30.3/22.3

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతం అవుతుంది. జిల్లావ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ చీఫ్ విప్‌కు పతాకావిష్కరణ బాధ్యతలు

వనపర్తి: జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగే స్వాతంత్య్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. బుధవారం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏయే జిల్లాలో ఎవరెవరు జెండా ఆవిష్కరణ చేయాలనే వివరాలతో ప్రత్యేకంగా జారీ చేసిన ఉత్తర్వుల్లో జిల్లా నుంచి ఆయన పేరును ప్రకటించింది.

పోలీసుల తీరు సరికాదు : బీజేపీ



వనపర్తిటౌన్: ఇటీవల జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ వరకు ప్రధాని మోదీ దిష్టిబొమ్మతో కాంగ్రెస్ నేతలు శవయాత్ర నిర్వహించి దగ్ధం చేస్తుంటే పోలీసులు పట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ వరకు పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ అధ్యక్షతన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలతో నాయకులు కార్యకర్తలు శవయాత్ర నిర్వహించబోగా పోలీసులు అడ్డుకొని కార్యాలయానికి తాళం వేసి చెల్లాచెదురు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తే అడ్డుకోని పోలీస్ యంత్రాంగం, సీఎం శవయాత్రను ఆదిలోనే అడ్డుకోవడం ఏమిటని, ఇదేం వివక్ష అని మండిపడ్డారు. మోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై దేశద్రోహం కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి అక్కల రామన్‌గౌడ్, కోశాధికారి భాసెట్టి శ్రీను, మోర్చాల రాష్ట్ర నాయకులు కదిరె మధు, అలివేలమ్మ, మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధ, అధికార ప్రతినిధి పెద్ది రాజు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై విస్తృత చర్చ జరగాలి : కాంగ్రెస్



వనపర్తిటౌన్: ప్రజాస్వామ్యానికి వెలుగునిచ్చే ఎన్నికల వ్యవస్థలో లోపాలు సరిదిద్దాలని, ఓ కుటుంబంలో పదుల సంఖ్యలో ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ అధినాయకత్వం ఆధారాలతో బయటపెడుతుంటే రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు స్పందించకపోవడం సిగ్గుచేటని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఎన్నికల సంఘం వ్యవస్థలో లోపాలు, పలు రాష్ట్రాల్లో ఓట్ల చోరీపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎల్‌సీడీ స్క్రీన్‌పై అవగాహన కల్పించారు. పేపర్ బ్యాలెట్ విధానంలో అన్ని ఎన్నికలు నిర్వహించాలని, అప్పుడే ప్రజాస్వామ్య పాలనకు అడుగులు పడతాయన్నారు. ఓట్ల చోరీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఉదంతాలపై సామాన్య ప్రజల నుంచి మేధావుల వరకు విస్తృత స్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే జిల్లా ఆస్పత్రిలోని అంబులెన్స్ వాహనాలపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఉంటే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తప్పుపట్టడం సరైంది కాదన్నారు. గతంలో సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన అంబులెన్స్ వాహనాలపై జాయన ఫొటోలు ముద్రించినప్పుడు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. డీసీసీ ప్రధానకార్యదర్శి చీర్ల జనార్దన్, మైనార్టీసెల్ అధ్యక్షుడు సమద్‌మియా, పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ, పెద్దమందడి మండల అధ్యక్షుడు పెంటన్న యాదవ్, సేవాదళ్ అధ్యక్షుడు జానకిరాములు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, సీనియర్ నాయకులు రాగి వేణు, కోళ్ల వెంకటేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, గద్దం వినోద్ పాల్గొన్నారు.

16న ఎస్‌జీఎఫ్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–15 బాల, బాలికల వాలీబాల్ ఎంపికలను స్థానిక మెయిన్ స్టేడియంలో ఈనెల 16న ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల బోనఫైడ్, ఆధార్ జిరాక్స్ కాపీలతో రిపోర్టు చేయాలని ఆమె కోరారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు మాత్రమే ఎంపికలకు రావాలని సూచించారు.

కష్టాల కడలిలో గంగమ్మ

ఫైనాన్స్ బోర్డు తిప్పేయడంతో బతుకులు కుదేలు

- మనోవేదనతో కిడ్నీలు దెబ్బతిని భర్త హరిబాబు మృతి
- ఆస్పత్రుల్లో చికిత్సకు రూ.10 లక్షలు దాటిన ఖర్చు
- అప్పులు చేసి.. చివరి వరకూ ప్రయత్నించినా కోలుకోని భర్త
- ముగ్గురు ఆడపిల్లలు, ముసలి అత్తామామలతో పోషణభారం
- గూడు లేక ముంపు గ్రామమైన పాత బండ రాయిపాకులలోనే జీవనం
- వెంటాడుతున్న అడవి జంతువుల భయం.. ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు



మృతిచెందిన హరిబాబు ఫొటో చూపిస్తూ ఆదుకోవాలని దీనంగా అర్థిస్తున్న ఆయన భార్య గంగ, తల్లి మల్లమ్మ, తండ్రి మిద్దె పెద్ద లక్ష్మయ్యను పై దృశ్యంలో చూడవచ్చు.

పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బండరాయిపాకుల గ్రామానికి చెందిన నిర్వాసిత కుటుంబం. వ్యవసాయ భూమి, నివసిస్తున్న ఇల్లుతో పాటు వారి జ్ఞాపకాలన్నీ పాలమూరు ప్రాజెక్ట్‌లో తుడిచిపెట్టుకుపోయాయి. వచ్చిన పరిహారం ఫైనాన్స్ నిర్వాహకులకు ఫలహారంగా మారడం.. డబ్బులు వస్తాయో, రావోననే బెంగతో హరిబాబు కిడ్నీ వ్యాధి బారిన పడి మృతి చెందడంతో ఆ కుటుంబం కకావికలమైంది. గూడు లేక, పట్టించుకునే వారు లేక ముంపులోని పాత గ్రామంలో భయం భయంగా జీవనం సాగిస్తున్న ఆ కుటుంబ దీనగాథ..

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

సాఫీగా సాగుతున్న జీవితంలో..

మిద్దె మల్లమ్మ, పెద్ద లక్ష్మయ్యకు నలుగురు కొడుకులు. అందరికీ పెళ్లిళ్లు కాగా.. మొదటి ముగ్గురు గతంలోనే బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. చివరి సంతానం హరిబాబు కాగా.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన వీరస్వామి, వీరసంత దంపతుల చిన్న కూతురు గంగతో సుమారు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. ప్రస్తుతం పెద్ద కుమార్తె శ్రుతి ఇంటర్మీడియట్ ఫస్టియర్, శాన్వి ఏడు, సమీర నాలుగో తరగతి చదువుతున్నారు. హరిబాబు ఆటో, ట్రాక్టర్ నడుపుతూ వీరిని పోషించేవాడు. తల్లిదండ్రులు కూడా వీరితోనే ఉండేవారు. ఉన్నంతలో అల్లారుముద్దుగా పిల్లలతో గడుపుతూ.. జీవనం సాగిస్తున్న క్రమంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో ఆ కుటుంబం తమకున్న వ్యవసాయ భూమి, ఇల్లును కోల్పోవాల్సి వచ్చింది. వచ్చిన పరిహారంలో హరిబాబు తనకు వచ్చిన వాటాలో నెలనెలా వడ్డీ వస్తుందనే ఆశతో రూ.6.80 లక్షలను 2021లో ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్‌లో పెట్టాడు. ఇదే వారి కుటుంబానికి శాపంగా మారింది.

ఫైనాన్షియర్ల ఉచ్చులో పడి.. అనారోగ్యం పాలై..

2021లో ఫైనాన్స్‌లో రూ.5 లక్షలను జమచేయగా.. నిర్వాహకులు తొలుత నెలకు రూ.2 చొప్పున వడ్డీ చెల్లించారు. ఆ తర్వాత ఇవ్వకపోవడంతో హరిబాబు నాగర్‌కర్నూల్‌లోని ఫైనాన్స్ కార్యాలయం, నిర్వాహకుల ఇళ్లకు నిత్యం తిరిగేవాడు. అయినా ఫలితం లేకపోవడంతో డబ్బులు వస్తాయో, రావోననే మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో బీపీ రాగా.. క్రమక్రమంగా ఆయన ఆరోగ్యం దెబ్బతింది. కిడ్నీలు దెబ్బతినగా.. సుమారు ఎనిమిది నెలలు హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో కుటుంబ సభ్యులు పునరావాసం కింద హరిబాబుకు వచ్చిన ప్లాటును అమ్మి వైద్య చికిత్స చేయించారు. ఈ క్రమంలో 11 నెలల కిత్రం చికిత్స పొందుతూ మృతిచెందడంతో ఆయన కుటుంబం దిక్కులేనిదైంది. హరిబాబుకు ఆస్పత్రి ఖర్చులు రూ.10 లక్షలకు పైగా అయ్యాయని.. అయినా బతికించులేకపోయామని.. ప్రస్తుతం అప్పుల కుప్ప అయిందని ఆయన కుటుంబసభ్యులు వాపోతున్నారు.



నిర్మానుష్యంగా మారిన పాత బండరాయిపాకుల

గూడు లేక.. పోషణ భారమై..

పునరావాసం కింద కొత్త బండరాయిపాకులలో ఇచ్చిన ప్లాట్‌ను అమ్మడంతో గంగ కుటుంబానికి గూడు లేకుండా పోయింది. దీంతో వారు ముంపులోని పాత బండరాయిపాకులలో తమ చేను వద్ద ఉన్న కవర్‌తో కప్పిన చిన్న గుడిసెలో ఉంటున్నారు. ఎప్పుడు నీళ్లొస్తాయో.. అడవి పందులు, ఇతర జంతువులు ఎప్పుడు దాడి చేస్తాయో తెలియక భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. అయితే గంగ అత్త మల్లమ్మ పేరిట కొత్త బండరాయిపాకులలో ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. కానీ డబ్బులు లేక బేస్‌మెంట్ కూడా కట్టలేదు. దీంతో ఇందిరమ డబ్బులు రాలేదని హరిబాబు తల్లి వాపోయింది. మరోవైపు చిన్నవయసులో ముగ్గురు ఆడపిల్లలు, ముసలి అత్తామామలతో పోషణ భారం కాగా.. ఆదుకునే ఆపన్నహస్తం కోసం గంగ ఎదురుచూస్తోంది.

గతిలేని పరిస్థితి మాది..

నా భర్త ఉన్నప్పుడు ఎప్పుడూ సంతోషంగా ఉండేవాళ్లం. ఇప్పుడు గతిలేని పరిస్థితి మాది. వానొస్తే మొత్తం కురుస్తుంది. వరద ఎప్పుడొస్తుందో తెలియదు. రేషన్ బియ్యమే మాకు దిక్కు. అదీ కొత్త బండరాయిపాకులకు వెళ్లి తెచ్చుకోవాలి. పిల్లలను పోషించలేక వనపర్తిలోని గురుకుల పాఠశాలల్లో చేర్పించా. అక్కడైనా బువ్వ దొరుకుతుందని. ఫైనాన్సోళ్ల నుంచి మా డబ్బులు మాకు ఇప్పించి న్యాయం చేయాలి. – గంగ, మృతుడు హరిబాబు భార్య

జైల్లో పెట్టండి.. ఎక్కడికైనా వస్తాం..

ఈ ముసలితనంలో నా కోడలు, పిల్లలకు జరంత అండగా ఉంటామంతే. మేము పోతే వీరి పరిస్థితి ఇంకా ఆగమే. ఇటీవల బ్యాంకోళ్లు వచ్చారు. రూ.2 లక్షల అప్పు ఉందని.. ఇప్పుడు రూ.5 లక్షలు అయిందని చెబుతున్నారు. కోర్టు కేసు పెడతామని.. జైలుకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. రూపాయి అప్పు పుడుత లేదు. పిల్ల తీర్చ లేదు. పిలగాడు లేక పాయె. పెడితే అందరినీ జైల్లో పెట్టండి. ఎక్కడికైనా వస్తాం. అక్కడ బువ్వ అయినా దొరుకుద్ది. ఫైనాన్సోళ్ల మోసంతోనే నా కుటుంబం దిక్కులేనిదైంది. ప్రభుత్వం, పెద్దలు, దాతలు స్పందించాలి. నా కొడుకు పిల్లలకు కనీసం బుక్కులు, పెన్నులైనా కొనియ్యండి.

– మల్లమ్మ, మృతుడు హరిబాబు తల్లి



ఆ ఊళ్లో 2 కుటుంబాలే..



వనపర్తి జిల్లా రేవల్లి మండలం పాత బండరాయిపాకులలో గతంలో 480 కుటుంబాలు నివసించేవి. సుమారు నాలుగు వేల మంది జనాభా ఉండగా.. 1,800 మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో ఈ గ్రామం ముంపునకు గురవుతుండగా.. 2021లో ప్రజలను ఖాళీ చేయించారు. పునరవాసం కింద కొత్తగా నిర్మించిన బండరాయిపాకులకు తరలించారు. అందరూ వెళ్లగా ప్రస్తుతం పాత గ్రామంలో రెండు కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. అన్నాదమ్ములైన మిద్దె పెద్ద లక్ష్మయ్య (మృతుడు హరిబాబు తండ్రి), మిద్దె చిన్న లక్ష్మయ్య కుటుంబాలు పక్కపక్కన గుడిసెలు వేసుకుని ఉంటున్నాయి. ఊరంతా నిర్మానుష్యం కాగా.. ప్రస్తుతం అడవిలా తయారైన ఈ పాత ఊళ్లో దొరికే ఆకులు, అలుములతోనే ఆ రెండు కుటుంబాలు జీవిస్తున్నాయి.



అలుగుపారుతున్న గోపాల్‌దిన్నె రిజర్వాయర్

రెడ్ అలర్ట్

జిల్లాకు మూడురోజుల పాటు భారీ వర్షసూచన

- ఎల్లో అలర్ట్ నుంచి రెడ్ అలర్ట్‌లోకి మార్చిన వాతావరణశాఖ
- ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- తెరుచుకున్న సరళాసాగర్ సైఫన్లు
- ఆత్మకూర్–మదనాపురం మధ్య నిలిచిన రాకపోకలు
- 250కిపైగా అలుగు పారుతున్న చెరువులు

జిల్లాలో నమోదైన వర్షపాతం (మి.మీ.లలో..)

తేదీ	నమోదైన వర్షపాతం
3	0.1
6	1.8
7	7.4
8	42.6
9	36.7
10	7.0
11	18.2
12	36.4
13	8.9

వనపర్తి: జిల్లావ్యాప్తంగా రానున్న మూడురోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఎల్లో అలర్ట్‌లో ఉన్న జిల్లాను బుధవారం సాయంత్రం వాతావరణశాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సరళాసాగర్, గోపల్‌దిన్నె రిజర్వాయర్లతో పాటు సుమారు 250 చెరువులు, కుంటలు సైతం నిండుకుండగా మారి అలుగు పారుతున్నాయి. బుధవారం సాయంత్రం ఊకచెట్టువాగులో నీటి ఉధృతి పెరిగి ఆత్మకూర్–మదనాపురం మధ్య రాకపోకలు నిలిపివేసిన అధికారులు, పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

పీపనగండ్లలో 23.4 మి.మీ. వర్షపాతం..

జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. పీపనగండ్ల, శ్రీరంగాపురం మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. పీపనగండ్ల మండలంలో 23.4 మి.మీ., శ్రీరంగాపురంలో 21.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం జిల్లా సరాసరి వర్షపాతం 8.9 మి.మీ.గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఒక్క అమరచింత మినహా.. మిగతా అన్ని మండలాల్లో సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.



మదనాపురం మండలం దంతనూరు వద్ద ఉధృతంగా పారుతున్న వాగు

202 శాతం అధికంగా..

వానాకాలం ప్రారంభం నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవగా.. ఆగస్టులో ఇప్పటి వరకు సాధారణం కంటే 202 శాతం అధిక వర్షపాతం నమోదు కావటం గమనార్హం. మరో మూడురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జూరాల, భీమా ప్రాజెక్టుల నుంచి కాల్వలకు నీటి విడుదలను తాత్కాలికంగా నిలిపివేశారు.

వర్షాలకు ప్రాణనష్టం జరగొద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్లు కీమ్యానాయక్, యాదయ్య ఇతర జిల్లా అధికారులు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలో రానున్న మూడురోజులు భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి జిల్లా, మండల అధికారులు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. జిల్లా ఇప్పటి వరకు ఎల్లో జోన్‌లో ఉండగా.. ప్రస్తుతం రెడ్ జోన్‌లోకి మారినట్లు వాతావరణశాఖ హెచ్చరించిందన్నారు. వర్షాలతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టాలని.. అంతర్గత సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఆయా మండలాల్లో ఉన్న లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలు, నది పరీవాహక ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, పునరావాస కేంద్రాలను గుర్తించి నివేదికను గురువారం కలెక్టరేట్‌కు అందజేయాలని ఆదేశించారు. విపత్కర పరిస్థితిలో బాధ్యతల నుంచి ఏ ఒక్క అధికారి తప్పించుకోవడానికి వీలులేదని.. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మూడు రోజుల వరకు ఎలాంటి సెలవులు లేవని.. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, విద్యుత్ అధికారులు, స్టేషన్ హౌజ్ అధికారులు తమ కేంద్రాల్లో ఉంటూ పరిస్థితులను గమనించాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి అందులో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు, పశువుల కాపరులు మేపునకు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది వాహనాలతో సిద్ధంగా ఉండాలని, ఎక్కడైనా స్తంభాలు విరగడం, తీగలు తెగటం వంటి సమస్యలు తలెత్తితే సరఫరా నిలిపివేసి ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేయాలన్నారు.

పోలీసు సిబ్బందికి ఆదేశాలిచ్చాం..

రానున్న మూడురోజులు విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీసు సిబ్బందికి తగిన ఆదేశాలు ఇచ్చామని ఎస్పీ రావుల గిరిధర్ వివరించారు. సరళాసాగర్ జలాశయం సైఫన్లు తెరుచుకుని నీరు పారుతుందని.. పోలీస్, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలు రోడ్డు దాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నది పరీవాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని, ప్రజలు ప్రవహిస్తున్న వాగులు దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఎస్.కీమ్యానాయక్, యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు..

వర్షాల విపత్తును ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఏదైనా విపత్కర పరిస్థితి తలెత్తితే వెంటనే **08545-220351/233525** కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని.. రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల, విద్యుత్‌శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.

సరళాసాగర్ పరిశీలన..

మదనాపురం: సరళాసాగర్ జలాశయానికి వరద పెరిగి సైఫన్లు తెరుచుకోవడంతో బుధవారం సాయంత్రం కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ సందర్శించి నీటిమట్టం గురించి నీటి పారుదలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 0.49 టీఎంసీల నీటి నిల్వ ఉందని.. రెండు ఉడెన్ సైఫన్లు తెరుచుకున్నాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాగులు, కుంటలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే శంకరంపేట–దంతనూరు గ్రామాల మధ్యన ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కాజ్‌వేను వారు పరిశీలించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాజ్‌వేలు దాటడానికి ఎవరిని అనుమతించవద్దని ఆదేశించారు. వారి వెంట ఆర్డీఓ సుబ్రమణ్యం, నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



సిబ్బందితో ప్రతిజ్ఞ చేస్తుయిన్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, భావితరాలకు ఉజ్వల భవిష్యత్ అందిద్దామని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్–2025లో భాగంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన అధికారులు, సిబ్బందితో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం దేశవ్యాప్తంగా నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) అమలు చేస్తోందన్నారు. అవగాహన ప్రచారం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిధిలో మాదకద్రవ్య వినియోగానికి వ్యతిరేకంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, ప్రజలను భాగస్వామ్యాన్ని చేయాలనే ముఖ్య ఉద్దేశంతో సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా పరిధిలో గంజాయి రవాణా చేసినా, సాగుచేసినా చట్టపరమైన చర్యలు తప్పవని.. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ సునందన, రిజర్వ్ సీఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, డీసీఆర్బీ ఎస్ఐ తిరుపతిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, కార్యాలయ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాక్-ఇన్-అడ్మిషన్లు

వనపర్తి: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకుగాను వాక్-ఇన్-అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో సీట్లు పొందని అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని.. కొత్త విద్యార్థులు తప్పనిసరిగా వాక్-ఇన్-అడ్మిషన్లకు ముందే https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తునకు 28వ తేదీ వరకు అవకాశం ఉందని.. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు ఏదేని ఒక ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటీఐ కళాశాలకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అప్లికేషన్ ప్రింట్ కాపీతో పాటు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నేరుగా హాజరుకావాలన్నారు. సీట్లు పూర్తిగా మెరిట్ ఆధారంగా కేటాయిస్తామని.. ఒకసారి అడ్మిషన్ పొందిన తర్వాత మళ్లీ అవకాశం ఉండదని వివరించారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లు 94902 02037, 98492 44030, 79953 35372 సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

పాన్‌గల్: రైతులు ఎరువులు, పురుగు మందులను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వినియోగించాలని, ఇష్టానుసారంగా వాడితే నేల సారం దెబ్బతినడంతో పాటు డబ్బులు వృథా అవుతాయని జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులుగౌడ్ రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో రైతు ఈశ్వరయ్య సాగు చేసిన వరి పంటను అధికారులతో కలిసి పరిశీలించి ఎరువుల వినియోగం, తెగుళ్లు ఆశిస్తే వాడాల్సిన పురుగు మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జిల్లా రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. యూరియాను అవసరం మేరకు వాడాలని, ఎక్కువ మోతాదులో వినియోగించొద్దని సూచించారు. ఆయన వెంట ఏడీఏ తిప్పేస్వామి, ఇన్‌చార్జ్ ఏఓ డాకేశ్వర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆంజనేయులుగౌడ్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


గణేష్ నాయక్ (ఫైల్)

మద్దూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని పిల్లిగుండుతండా సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. హన్మనాయక్ తండాకు చెందిన గణేష్‌నాయక్ (26) అదే గ్రామానికి చెందిన హర్యానాయక్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి నిర్మాణానికి గ్రానైట్ రాయిని ట్రాక్టర్‌పై హన్మనాయక్‌తండా నుంచి నందిపాడ్‌కు తరలిస్తుండగా పిల్లిగుండ తండా సమీపంలో అదుపు తప్పడంతో గణేష్ నాయక్ ట్రాక్టర్ వదిలి కిందకు దూకుతూ వెనుక టైర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

కొల్లాపూర్ రూరల్: ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ హృషికేశ్ కథనం ప్రకారం.. మండలంలోని నార్లాపూర్‌కు చెందిన దాసరి రాజు(24) నార్లాపూర్ – చెంచుగూడెంకు ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా.. అదుపు తప్పి ప్రమాదవశాత్తు వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. రాజుకు తీవ్ర గాయాలు కావడంతో కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో మృతుడితోపాటు మల్లేశ్ అనే యువకుడు ఉన్నాడు. అతడికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు మృతి



కేటీదొడ్డి: పిడుగుపాటుతో ఆవు మృతిచెందిన ఘటన మండలంలోని పాగుంటలోని చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన స్వామి ఆవును పొలం వద్ద కట్టేశాడు. మంగళవారం రాత్రి పిడుగుపాటుకు ఆవు మృతిచెందింది. బుధవారం ఉదయం పొలం దగ్గరికెళ్లి చూడగా ఆవు మృతి చెందింది. రూ.60వేలతో ఆవు మృతి చెందడంతో రైతు స్వామి బోరున విలపించాడు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరాడు.

పెబ్బేరులో నగదు చోరీ

వనపర్తి రూరల్: పట్టణంలోని పీజేపీ క్యాంప్ కార్యాలయం వద్ద బైక్‌లో ఉన్న నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన బుల్లెదుల ఆంజనేయులు బుధవారం ఉదయం 11.30 గంటలకు పెబ్బేరు పట్టణంలోని ఎస్‌బీఐలో రూ.2.20లక్షలు విత్‌డ్రా చేశాడు. మొత్తం నగదును బైక్ టూల్ బాక్స్‌లో పెట్టి లాక్ చేసి కార్యాలయంలోకి వెళ్లాడు. తిరిగి బైక్ దగ్గరకు వచ్చి చూడగా టూల్ బాక్స్ ఓపెన్ చేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు నగదును ఎత్తుకెళ్లారని గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీ ఘటనపై అధికారుల విచారణ

బల్మూర్: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కార్మికుల మధ్య దాడి ఘటనపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రాఘవులు, ఎస్ఐ రాజేందర్, ఎంఈఓ విష్ణుమూర్తి విచారణ చేపట్టారు. విద్యార్థినులతో మాట్లాడి వివరాలు అడిగి తెసుకున్నారు. వాచ్‌మేన్‌తో పాటు ఇద్దరు కార్మికులు నిత్యం తాగొచ్చి మద్యం మత్తులో రాత్రిళ్లు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని తెలిపారు. వాచ్‌మేన్‌పై ఎస్ఓకు ఫిర్యాదు చేసినా ప్రవర్తనలో మార్పు లేదని వాపోయారు. కాగా ఎస్ఓ పర్యవేక్షణ లోపంతోనే ఉపాధ్యాయులు, సిబ్బంది మధ్య సమన్వయం లోపించి ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు విచారణ చేసి తగిన న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధర

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి ధరలు స్వల్పంగా పెరిగాయి. గత వారం కన్నా గరిష్టంగా రూ.60, కనిష్టంగా రూ. 50 వరకు ధర పెరిగింది. సీజన్ ముగిసినప్పటికీ రైతులు యాసంగిలో పండించిన ఉల్లిని నిల్వ చేసుకొని ప్రస్తుతం మార్కెట్‌కు అమ్మకానికి తెస్తున్నారు. దాదాపు వేయి బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో వ్యాపారులు పోటా పోటీగా వేలంలో పాడి ఉల్లిని కొనుగోలు చేశారు. వేలంలో క్వింటాల్ ఉల్లి ధర గరిష్టంగా రూ.1,860 , కనిష్టంగా రూ.950 వరకు ధర వచ్చింది. 50 కేజీల ఉల్లి బస్తాను గరిష్ట ధర రూ.950, కనిష్టంగా రూ.500 వరకు విక్రయించారు.

జలాశయాలకు జలకళ


జూరాల ఎనిమిది గేట్లద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

- 90వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 91,340 ఔట్‌ఫ్లో
- 8క్రస్టుగేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- 12 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టుకు లక్షా5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 90వేలకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 8 క్రస్టు గేట్లను ఎత్తి 54, 352 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 12 యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36, 628 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 91, 340 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.991 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

29.6 అడుగులకు కోయిల్‌సాగర్


దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం చేరడానికి కేవలం మూడు అడుగుల దూరంలో నీటిమట్టం నిలిచింది. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులో 29.6 అడుగలకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. మరో మూడు అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు గేట్లను తెరిచేందుకు వీలుంది. పెద్దవాగు ప్రవాహం భారీగా వస్తే ఒక్కరోజులో ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది.

12 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాలకు పైనుంచి వరద వచ్చి చేరుతుండడంతో ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు బుధవారం 12యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6యూనిట్ల ద్వారా 240మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు.

రామన్‌పాడు రెండు గేట్లు ఎత్తివేత

మదనాపురం: సరళాసాగర్, శంకరసముద్రం నుంచి వరద రామన్‌పాడుకు వచ్చి చేరడంతో ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వరద ఉధృతి కారణంగా దంతనూరు, శంకరమ్మపేట గ్రామాల మధ్య ఊకచెట్టు వాగు ప్రవహించి రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మదనాపురం ఊకచెట్టు వాగు ప్రవహించి ఆత్మకూర్, వనపర్తి, కొత్తకోట, అమరచింత, చిన్నచింతకుంట మండలాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


రామన్‌పాడు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

సుంకేసుల 11 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంకు వరద నీరు వచ్చి చేరుతుడంతో 11గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 47వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 11గేట్లను తెరిచి 42,669 క్యూసెక్కులను దిగువకు వదిలి, కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కులను వదిలినట్లు పేర్కొన్నారు. మొత్తం డ్యాం నుంచి 44, 516 క్యూసెక్కులు దిగువకు వెళ్లినట్లు ఆయన తెలిపారు.



ఉద్రిక్తత మధ్య విగ్రహాల తొలగింపు


నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలను తొలగిస్తున్న సిబ్బంది


విగ్రహాల తొలగింపు వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

- నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలు సాఫీగా..
- అంబేడ్కర్ విగ్రహం తీయొద్దంటూ దళిత సంఘాల ఆందోళన
- మొదట అంబేడ్కర్ విగ్రహం తొలగించాలని పట్టుబట్టిన బీసీలు
- రోడ్డు పనులు పూర్తయ్యాక పునఃప్రతిష్ఠాపనకు హామీ
- ఆందోళనకారులను బుజ్జగించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, జడ్చర్ల టౌన్: 167వ నెంబరు జాతీయ రహదారిపై మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డ రైల్వే బ్రిడ్జ్‌కు రెండువైపులా ఉన్న మహనీయుల విగ్రహాల తొలగింపు ఉద్రిక్తతకు దారి తీసింది. రోడ్డు విస్తరణ పనులకు ఆటంకంగా ఉన్న విగ్రహాలను తొలగించాలని పలుమార్లు ప్రయత్నించినప్పటికీ బుధవారం కార్యరూపం దాల్చింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలిలా.. సిగ్నల్ గడ్డ బ్రిడ్జ్‌కు ఒకవైపు నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలతోపాటు పైలాన్ ఉంది. వాటిని బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2:30గంటల వరకు రెండు క్రేన్ల సహాయంతో సాఫీగానే తొలగించారు. రెండు విగ్రహాలు కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధానులు కావడంతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎలాంటి ఆటంకం కలిగించలేదు. అయితే ఇందిరాగాంధీ విగ్రహం తొలగించేందుకు 4గంటల సమయం పట్టడం మున్సిపాలిటీ అధికారులు, సిబ్బందిని కొంత ఇబ్బందులకు గురిచేసింది. విగ్రహాల తొలగింపు ముందుగానే ప్రచారం కావడంతో రైల్వేబ్రిడ్జ్‌కు ఇవతల ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితసంఘాల నాయకులు గుమిగూడారు. ఉదయం 10గంటలనుంచే అధికారుల రాకకోసం వేచి చూశారు. టెంట్ వేసి దీక్షకు కూర్చునేందుకు యత్నించగా సీఐ కమలాకర్ జోక్యం చేసుకుని టెంట్ వేయకుండా అడ్డుకున్నారు. బ్రిడ్జ్‌కు మరోవైపు ఉన్న విగ్రహాల తొలగింపు పూర్తయ్యాక కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ పుష్పలత, వార్డు కౌన్సిలర్లు క్రేన్లను తీసుకుని అంబేడ్కర్, పూలే, శ్రీకాంతాచారి విగ్రహాలను తొలగించేందుకు వచ్చారు. ఈ సదర్భంగా దళిత సంఘాల నాయకులు కమిషనర్, చైర్‌పర్సన్‌తో వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విగ్రహం తొలగించేది లేదని వాదనకు దిగారు. ప్రస్తుతం విగ్రహం తొలగించి రోడ్డు పనులు పూర్తయ్యాక కొద్దిగా పక్కకు ప్రతిష్ఠిస్తామని కమిషనర్, చైర్‌పర్సన్ హామీ ఇచ్చినప్పటికీ వారు వినలేదు. కావేరమ్మపేట రోడ్డులో ఇదివరకు అంబేడ్కర్ విగ్రహం తొలగించి ఎందుకు పునఃప్రతిష్ఠ చేయలేకపోయారని మండిపడ్డారు. జాతీయ రహదారుల శాఖ ఏఈ రవి సైతం విగ్రహాన్ని తిరిగి అక్కడే ప్రతిష్ఠిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అంగీకరించలేదు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అక్కడికి చేరుకుని దళిత సంఘాల నాయకులు, అధికారులతో మాట్లాడారు. విగ్రహం పునఃప్రతిష్ఠ చేయడానికి అధికారులు సిద్ధంగా ఉన్నందున విగ్రహం తొలగించేందుకు సహకరించాలని కోరారు. ఈ క్రమంలోనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వరకు గడువు ఇవ్వాలని సూచించారు. ఇదిలా కొనసాగుతుండగానే అధికారులు పక్కనే ఉన్న పూలే విగ్రహం తొలగించేందుకు క్రేన్‌ను ఉంచగా.. బీసీ సంఘాలు అడ్డుపడ్డాయి. విగ్రహం ఎక్కడ ప్రతిష్ఠిస్తారో చెప్పాలని, ముందు అంబేడ్కర్ విగ్రహం తొలగించాకే పూలే విగ్రహం తీయాలని పట్టుబట్టారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కలెక్టర్‌తో సంప్రదింపులు జరిపి విగ్రహాలను ఇదేరోజు తొలగించాలని సూచించారు. దీంతో ముందుగా అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి అనంతరం పూలే, శ్రీకాంతాచారి విగ్రహాలను తొలగించారు. తొలగించిన విగ్రహాలు డీసీఎంలో మున్సిపల్ కార్యాలయానికి తరలించా రు. రోడ్డు పనులు పూర్తయ్యాకే పునఃప్రతిష్ఠ చేయనున్నారు. ఎట్టకేలకు ఉద్రిక్తత మధ్య రోడ్డు పనులకు ఆటంకంగా ఉన్న విగ్రహాలను తొలగించడంతో చైర్‌పర్సన్, కమిషనర్, పాలకవర్గం ఊపిరిపీల్చుకున్నారు.


ఆందోళనకారులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి

వర్షంలోనే విగ్రహాల తొలగింపు

మున్సిపాలిటీలోని సిగ్నల్‌గడ్డపై రోడ్డు విస్తరణలో భాగంగా బుధవారం చేపట్టిన మహనీయుల విగ్రహాల తొలగింపు రాత్రి పొద్దుపోయేదాకా వర్షంలోనే కొనసాగింది. ఉదయం నుంచి అడపాదడపా వర్షం పడుతుండడంతో విగ్రహాల తొలగింపునకు కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా అంబేద్కర్ విగ్రహం తొలగింపు పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం, రాత్రి 8గంటల తర్వాత భారీ వర్షం కురవడంతో కొద్దిసేపు తొలగింపు పనులు నిలిపివేశారు. శ్రీకాంతాచారి విగ్రహం కూడా రాత్రి 9గంటలు దాటాకనే తొలగించారు. అయితే ఎంత రాత్రయినా విగ్రహం తొలగింపు చేస్తామని కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. తొలగించిన విగ్రహాలను కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసుశిక్షణ కేంద్రానికి తరలిస్తామని వెల్లడించారు.

స్కూల్ బస్సు బోల్తా.. విద్యార్థులకు స్వల్ప గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని గన్యాగుల గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. పెద్దకొత్తపల్లిలోని ఆల్ సెయింట్స్ మోడల్ స్కూల్‌కు చెందిన పాఠశాల బస్సు నాగపూర్, రాయిపాకుల గ్రామాల్లోని విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు వెళుతుండగా గన్యాగుల శివారులో మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అడ్డురావడంతో దానిని తప్పించబోయి బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అక్కడే వరి నాట్లు వేస్తున్న కూలీలు అప్రమత్తమై బస్సులో నుంచి పాఠశాల విద్యార్థులను బయటకు తీశారు. బస్సులో మొత్తం 20 మంది విద్యార్థులు ఉండగా కొందరికి స్వల్పగాయాలయ్యాయి. ఎవరికీ ఎలాంటి హానీ కలగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం విద్యార్థులను ఆటోల్లో ఇంటికి పంపించారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


గన్యాగుల శివారులో పంట పొలంలో బోల్తా పడిన ప్రైవేటు పాఠశాల బస్సు

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

గద్వాల: మద్యంతాగి విధుల్లో నిర్లక్ష్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు రవిచందర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ ఉత్తర్వులు జారీ చేశారు. రవిచందర్ రాజోళి మండలం చిన్నధన్వాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలలో విధులు నిర్వహిస్తూ.. మద్యం తాగి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారులను సంభోదిస్తూ మాట్లాడిన వైనం సోషల్ మీడియాలో వైరలైంది. స్పందించిన కలెక్టర్ సంతోష్ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ఎవరైనా విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

స్పందించారు.. సీజ్ చేశారు

- కర్రీపఫ్‌లోపాము ఘటనపై ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ
- వెలుగులోకి విస్తుపోయే వాస్తవాలు
- అనుమతి లేకుండా బేకరీ నిర్వహణ
- కాలం చెల్లిన పదార్థాలు, రసాయనాల వినియోగం
- పలు కారణాలతో బేకరీ సీజ్, ల్యాబ్‌కు నమూనాలు


బేకరీలో కాలం చెల్లిన తయారీ పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ నీలిమ

జడ్చర్ల: బేకరీలో కొనుగోలు చేసిన కర్రీపఫ్‌లో పాము వచ్చిన ఘటనపై జిల్లా ఆహార భద్రత అధికారులు స్పందించారు. బుధవారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ సిబ్బందితో కలిసి జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పాము ఉన్న కర్రీ పఫ్‌ను పరిశీలించి శాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. అనంతరం పఫ్‌ను విక్రయించిన శ్రీలక్ష్మి బెంగుళూరు బేకరీలో తనిఖీలు చేశారు. తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. అసలు బేకరీ నిర్వహణకు సంబంధించి ఎలాంటి అనుమతిలేదు. అంతేకాక కాలంచెల్లిన ఆహార పదార్థాలు, రసాయనాలు, క్రీములు వినియోగించడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అపరిశుభ్రమైన పరిసరాల మధ్య బేకరీ ఉత్పత్తులు ఉండడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఫుడ్ లైసెన్స్ లేకపోవడం , గడువు ముగిసిన పదర్థాలను ఉపయోగించం, పరిశుభ్రత పాటించక పోవడంపై బేకరీ నిర్వాహకులకు నోటీస్‌ను జారీ చేసి దుకాణాన్ని సీజ్ చేశారు. ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హోటళ్లు, బేకరీలు తదితర ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించే వారు ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని, అదేవిధంగా నాణ్యత కలిగిన ముడి సరుకును వినియోగించాలని తెలిపారు. ఫ్రీజర్‌లో దాచి వాటినే వేడిచేసి వినియోగదారులకు అందించడం చట్టవిరుద్ధమన్నారు. పరిశుభ్రత పాటించాలని, వంటపాత్రలను శుభ్రంగా ఉంచడంతోపాటు ఆహార పదార్థాల తయారీపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే హోటళ్లు, బేకరీలు, దాబాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో ఫుడ్ సేఫ్టీ సిబ్బంది శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.6.17 లక్షలు



మక్తల్: శ్రీపడమటి ఆంజనేయస్వామిలో బుధవారం ఆలయ చైర్మన్ ప్రణేష్‌చారీ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ శ్యామ్ సుందర్‌చారి మాట్లాడుతూ రూ.6.17 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ప్రతి ఏడాది ఆంజనేయస్వామి తిరుణాలకు ముందు హుండీ లెక్కించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, అరవింద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈజీ మనీ కోసం దారిదోపిడీ

- బైక్‌ను వెంటాడి క్యాష్ బ్యాగ్ ఎత్తుకెళ్లిన నిందితుల అరెస్ట్
- డీఎస్పీ వెంకటేశ్వర్లు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల: జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలోని రిధి మద్యం దుకాణాన్ని బంద్ చేసి ఆరోజు వచ్చిన కలెక్షన్ తీసుకుని బైక్‌పై ఏనుగొండకు వెళ్తున్న వైన్స్ క్యాషియర్ అరుణ్‌రెడ్డిని ఈనెల 7న రాత్రి ఇద్దరు గుర్తు తెలియని యువకులు స్కూటీపై వెంబడించి కొత్తతండా వద్ద బైక్‌ను అడ్డగించి కళ్లల్లో కారంపొడి జల్లి చేతిలో ఉన్న నగదు బ్యాగును అపహరించిన దారిదోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. దోపిడీ దొంగలను గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులకు వెల్లడించారు. మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేటకు చెందిన మూలింటి బాలాజీ, మూలింటి రవితేజ పథకం ప్రకారం.. దోపిడీకి పాల్పడ్డారు. దోపిడీ రోజు స్థానిక లాడ్జీలో తలదాచుకుని వైన్స్ వద్ద నగదుతో బయటకు వస్తున్న క్యాషియర్‌ను గమనించి స్కూటీపై బైక్‌ను వెంబడించారు. రూ.1.44 లక్షల క్యాష్ బ్యాగును ఎత్తుకెళ్లిన అనంతరం బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా బుధవారం జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై జాలీ హిల్స్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా స్కూటీపై వచ్చిన నిందితులు అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితుల నుంచి రూ.72,500తోపాటు మొబైల్ ఫోన్, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దోచుకున్న డబ్బుతో కొత్తగా మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేశారని పేర్కొన్నారు. నిందితుల్లో బాలాజీ ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా, రవితేజ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కమలాకర్, సిబ్బంది విష్ణుమూర్తి, కాశీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలోని చోటు చేసుకుంది. ఎస్ఐ మురళి కథనం మేరకు.. మానవపాడు మండలంలోని బోరవెల్లి గ్రామానికి చెందిన షేక్‌హుస్సేన్‌బాషా (30) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం వెంకటేష్ దాబా నుంచి తన బైక్‌పై ఇంటికి వస్తుండగా.. అదే గ్రామానికి చెందిన బోయ రమేష్ తన ద్విచక్ర వాహనంతో ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఇద్దరు వాగ్వాదానికి దిగడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య షేక్ నసీనాబి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

శంషాబాద్‌లో ప్రత్యక్షమైన అదృశ్యమైన విద్యార్థి!

అడ్డాకుల: మూసాపేట ఎస్సీ బాలుర హాస్టల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి శివశంకర్ మూసాపేటలో అదృశ్యమై శంషాబాద్‌లో ప్రత్యక్షమయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. పెద్దమందడి మండలం మద్దిగట్లకు చెందిన బాలుడి తల్లిదండ్రులు ప్రస్తుతం శంషాబాద్‌లో పనులు చేసుకుంటున్నారు. బాలుడు తప్పిపోయాడనే వార్త తెలుసుకుని మంగళవారం రాత్రి మూసాపేటకు చేరుకుని రాత్రంతా వెతికారు. బుధవారం సాయంత్రం శంషాబాద్‌లో తల్లిదండ్రులు ఉండేచోటుకు వెళ్లడంతో అక్కడ చికెన్ సెంటర్ నిర్వాహకుడు గుర్తించి బాలుడిని తన వద్దే ఉంచుకున్నాడు. తల్లిదండ్రులకు సమాచారమివ్వగా.. వెంటనే అక్కడికి వెళ్లి బాలుడిని ఇంటికి తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. విద్యార్థి అదృశ్యమైన తర్వాత హాస్టల్ వార్డన్ ఆనంద్, పోలీసులు, ట్యూటర్ మధుసూదన్ మంగళవారం అర్ధరాత్రి వరకు వెతికారు. బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు తెలిసిన చోటల్లా ఆరా తీశారు. అదృశ్యమైన బాలుడు తల్లిదండ్రుల చెంతకు చేరడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.